



ఏర్పాట్లు పరిశీలిస్తున్న జేసీ, ఇతర అధికారులు

నేడే జెండా పండగ

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహణ





పంద్రాగస్టు వేడుక కోసం సిద్ధమైన పోలీస్ పరేడ్ గ్రౌండు

కలెక్టరేట్, ఆగస్టు 14: జెండా పండగకు సర్వం సిద్ధం అయింది. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. కలెక్టరేట్ ప్రాంగణం విద్యుత్ దీపాల కాంతులతో వెలుగులీనుతోంది. ఇతర పట్టణాలు, పల్లెల్లోనూ ఉత్సాహభరిత వాతావరణం కన్పిస్తోంది. అనేక చోట్ల జాతీయ జెండాతో బుధవారం ఊరేగింపులు చేపట్టారు. వందలాదిగా విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా మూడు రంగుల జెండాను ఆవిష్కరించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. జిల్లా స్థాయిలో విజయనగరం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఈ వేడుకలు గురువారం నిర్వహిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి వివిధ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరుకానున్నారు. జాతీయ పతాకాన్ని ఆయన ఎగురువేశాక జిల్లా ప్రజలను ఉద్దేశించి సందేశం అందిస్తారు. శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల వీక్షణ తర్వాత ఉత్తమ అధికారులకు ప్రశంసా పత్రాలు అందించనున్నారు. అనంతరం స్టాల్స్ సందర్శన ఉంటుంది. ఈసారి ప్రభుత్వ శాఖల్లో పనిచేసే సుమారు 257 మంది ఉత్తమ అధికారులకు అవార్డులు ప్రదానం చేయనున్నారు. పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను జేసీ సేతు మాధవన్ బుధవారం సాయంత్రం ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. డీఆర్‌వో అనిత, ఆర్‌డీవోలు సూర్యకళ, మురళి కృష్ణ, జోసఫ్, విజయనగరం తహసీల్దార్ కూర్మనాథ్ తదితరులు ఉన్నారు. ఇదిలా ఉంటే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా కలెక్టరేట్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

బానిస సంకెళ్లు తెగిన సమయమది

బొబ్బిలి, ఆగస్టు 14: స్వాతంత్ర్య ఉద్యమ గురుతులు వారి మనోఫలకంపై ఎప్పటికీ పదిలం. బ్రిటీష్ వారి ఆగడాలు, దోపిడీలు, నిరంకుల విధానాలు, బానిస సంకెళ్లు.. వాటి నుంచి బయట పడటానికి స్వాతంత్ర్య సమరయోధుల వీరోచిత పోరాటం.. ప్రాణాలను సైతం పణంగా పెట్టిన అమరుల గురించి తెలిసిన.. చూసిన.. కొంత అనుభవించిన వారిని 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. ఆ నాటి స్మృతులను బొబ్బిలి పట్టణానికి చెందిన తొమ్మిది పదుల వయసు దాటిన సీనియర్ సిటిజన్లు వివరించారు. నేరుగా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనకపోయినప్పటికీ ఆ సమరంలో తామూ కొంత భాగస్వాముల మయ్యామంటున్నారు.

ఊరంతా ఉత్సాహం..



1947లో స్వాతంత్ర్యం వచ్చిన నాటికి నా వయసు 19 ఏళ్లు. బానిస బతుకులకు విముక్తి కలిగిందని ఊరంతా ఉవ్వెత్తున ఉత్సాహం వెల్లివెరిసింది. ఎన్నో పండుగలను ఒకేసారి చేసుకున్నంత సందడి కనిపించింది. ఎవరి జేబుల్లో ఎంత ఉంటే అంత సునాయాసంగా ఖర్చుచేశారు. గాంధీ, చంద్రబోసు, పటేల్, అల్లూరి సీతారామరాజు తదితరుల పేర్లు వింటే జనమంతా ఉబ్బితబ్బిబ్బయ్యేవారు. విశాఖలో గాంధీ, నె హ్రూ మీటింగుల కోసం అప్పటి మా తోటి యువకులమంతా పరుగులు తీసేవారం. నిత్యమూ ఉద్యమం కోసం పెద్దలు చర్చించుకునేవారు. మేమంతా ఆసక్తిగా ఆలకించేవారం. బ్రిటీషు వారు చేసే ఆగడాలు చెబుతుంటే ఏడ్చేసేవాళ్లం.

-సిద్దా సత్యనారాయణ(94 ఏళ్లు),
శ్రీకళాభారతి అధ్యక్షుడు, బొబ్బిలి

శనగకాయల కుప్పల్లో సైకిళ్లు దాచుకునేవాళ్లం..



స్వాతంత్ర్యం వచ్చిన విషయాన్ని దినపత్రికల్లో చూసి తెలుసుకున్నాం. మా గురువుగారు ఆకుండి రాజేశ్వరరావు మాస్టారు పోస్టుమాస్టర్‌గా కూడా పనిచేసేవారు. ఆయన పత్రికలు తెప్పించేవారు. ఆయన ద్వారా ఊరందరికీ ఈ సమాచారం తెలిసింది. ప్రజలంతా ఎంతో ఆనందించారు. నాకు అప్పుడు ఎనిమిదేళ్లు. సైకిలు తొక్కుతుండగా బ్రిటీషు పోలీసులకు కనిపిస్తే వాటిని లాక్కునేవారు. రైతులు నాటుబండిపై ఎక్కి కనిపించినా పోలీసులు సహించేవారు కాదు. వారు అల్లంత దూరాన ఉంటే పక్కకు తప్పించుకోవాల్సిందే. ఓ రోజు మా అందరి సైకిళ్లను తీసుకెళ్లడానికి పోలీసులు వస్తున్నారని తెలుసుకొని ఓ గోదాములో సైకిళ్లను పెట్టి వాటిని వేరుశనగ కాయలతో కప్పి ఉంచి భద్రపరుచుకునేవారం.

-కందుల ధర్మరాజు, రిటైర్డ్ టీచరు,
గజరాయునివలస, బాడంగి మండలం..

గొల్లపల్లిలో పెద్ద మీటింగు పెట్టారు..



1947లో స్వాతంత్ర్యం వచ్చిన విషయాన్ని పత్రికల ద్వారా తెలుసుకున్నాం. ముందుగానే ఈ ప్రకటన వెలువడడంతో బొబ్బిలి పట్టణ పరిధిలోని గొల్లపల్లి ఎయిడెడ్ పాఠశాలలో జాతీయజెండా ఎగురవేశారు. నాకు అప్పుడు 13 ఏళ్లు. ఐదోతరగతి పూర్తి చేశాను. సుమారు రెండువందలమంది విద్యార్థులం అక్కడకు హాజరయ్యాం. పాటలు పాడారు. పాఠశాల హెచ్‌ఎం అండ్ మేనేజరు అయిన మల్లమ్మపల్లి అప్పలస్వామి, చుండూరి గున్నేశ్వరరావు మాస్టార్లు ప్రసంగించారు. స్వాతంత్ర్యానికి ముందు తహసీల్దారు, స్కూలు ఇన్‌స్పెక్టరు లాంటి పెద్ద ఉద్యోగాల్లో బ్రిటీషు వారే ఉండేవారు. కిందిస్థాయి ఉద్యోగులుగా మాత్రమే మనవారు పనిచేసేవారు.

-వజ్జి రాములు(89 ఏళ్లు), రిటైర్డ్ హైస్కూలు హెచ్‌ఎం, పాతబొబ్బిలి

ప్రతి ఇంటిపైనా జెండా ఎగరాలి: కలెక్టర్

కలెక్టరేట్, ఆగస్టు 14: ప్రతి ఇంటి పైనా జాతీయ జెండా ఎగురువేసేలా ప్రజలను చైతన్య పరచాలని... మండల, క్షేత్రస్థాయి సిబ్బందిని కలెక్టర్ అంబేద్కర్ ఆదేశించారు. అధికారులతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ సమైక్యతను, దేశభక్తిని చాటేలా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురువేయాలని ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. కాగితం లేదా గుడ్డతో తయారు చేసిన జెండాలను మాత్రమే ఎగురవేయాలని, ఎక్కడా ప్లాస్టిక్ జెండాలు వాడకూడదని చెప్పారు.

- హర్ ఘర్ తిరంగా సంతకాల ఉద్యమం జిల్లాలో ప్రారంభమైంది. గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి వరకూ సంతకాలు సేకరించేందుకు ప్రణాళిక రూపొందించారు. కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితివిజయలక్ష్మి గజపతిరాజు, జేసీ సేతు మాధవన్, డీఆర్‌వో అనిత బుధవారం సంతకాలు చేశారు.



జాతీయ జెండా రంగుల్లో రైల్వే స్టేషన్



బొబ్బిలి పట్టణ ప్రధాన వీధుల్లో 150 అడుగుల జాతీయ జెండాతో ఊరేగింపు

150 అడుగుల జెండా ప్రదర్శన

బొబ్బిలి, ఆగస్టు 14: 150 అడుగుల జాతీయ జెండా ఊరేగింపు అందరినీ ఆకట్టుకుంది. స్వాతంత్ర్య సంబరాల్లో భాగంగా బుధవారం కారుణ్య ఫౌండేషన్, రోటరీక్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో బొబ్బిలిలో నిర్వహించిన భారీ ర్యాలీని స్థానిక తాండ్రపాపారాయ జంక్షన్‌లో ఆర్డీవో సాయిశ్రీ, మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ప్రారంభించారు. బొబ్బిలి పట్టణంలోని ప్రధాన వీధులలో సాగిన ర్యాలీలో యువత, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థల ఛైర్మన్ జేసీ రాజు, మున్సిపల్ టీడీపీ ఫ్లోర్‌లీడరు గెంబలి శ్రీనివాసరావు, రాష్ట్ర పెన్షనర్ల సంఘం నేత రౌతరామ్మూర్తి పాల్గొన్నారు.

ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎస్పీ

విజయనగరం క్రైం: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణలో భాగంగా సాయుధ పోలీసుల పరేడ్ రిహార్సల్‌ను ఎస్పీ వకుల్‌జిందాల్ బుధవారం పర్యవేక్షించారు. అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. పరేడ్ గ్రౌండ్‌లో తొలుత పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. కవాతు నిర్వహణలో అధికారులు, సిబ్బందికి నిర్దేశించారు.



నేతల చుట్టూ ప్రదక్షిణలు

- బదిలీ జీవో రాకమునుపే హామీ పొందే ప్రయత్నం
- పరిపాలనాపరమైన అవసరాల పేరుతో కోరుకున్న స్థానం కోసం..
- ఉద్యోగ బదిలీలకు ప్రభుత్వం రంగం సిద్ధం
- నేడో రేపో జీవో విడుదల

ఉద్యోగుల బదిలీలపై జీవో వస్తుందన్న సమాచారంతో జిల్లాలోని ఉద్యోగుల్లో హడావిడి మొదలైపోయింది. ఉత్తర్వులు రాకమునుపే నేతల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. కోరుకున్న స్థానం నుంచి కదలకుండా ఉండేందుకు, తప్పనిసరైతే దగ్గరలోనే పోస్టింగ్ పొందేందుకు అన్నిశాఖల అధికారులూ ప్రయత్నాలు మొదలెట్టేశారు. కొందరు ఇప్పటికే అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకుల నుంచి భరోసా పొందేశారు. పరిపాలనాపరమైన అవసరాల పేరుతోనూ బదిలీలకు అవకాశం కల్పిస్తుండడంతో రాజకీయ పలుకుబడి ఉన్న వారంతా ఈ మినహాయింపును వాడేసుకుంటున్నారు. అనుకూలమైన మండలాలు, గ్రామాల్లో పనిచేసేందుకు ఇప్పటికే ప్రజాప్రతినిధుల నుంచి అనుమతులు తీసుకున్నారు. కొంత మంది సిఫార్స్ లెటర్‌లను జేబుల్లో పెట్టుకొని తిరుగుతున్నారు.

విజయనగరం (ఆంధ్రజ్యోతి)/ కలెక్టరేట్/ శృంగవరపుకోట/ బొబ్బిలి/ రాజాం, ఆగస్టు 14:

- ఓ మండల స్థాయి పంచాయతీరాజ్ ఇంజనీర్ వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ ప్రజా ప్రతి నిధులు, నాయకులు చేసిన పనులకు బిల్లులు చేశారు. టీడీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలను కార్యాలయ గుమ్మం వద్దకు కూడా రానీయలేదు. చేతిలో కాసులు పడితే తప్ప పనిచేయరని అప్పటి వైసీపీ నేతలు బహిరంగంగా మాట్లాడేవారు. అయితే సార్వత్రిక ఎన్నికల ముందు ఆ మండలానికి చెందిన వైసీపీ నేతలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఇప్పుడు వీరంతా ఆ ఇంజినీర్‌నే మండలంలో పనిచేసేందుకు ఉంచాలని పట్టుబడుతున్నారు. దీనికి ఎమ్మెల్యే కూడా ఊకొట్టేసారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు మాత్రం ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఏం జరుగుతుందో చూడాలి.

ఉద్యోగుల సాధారణ బదిలీల పక్రియ రానే వచ్చింది. నెలాఖరులోపు ఉద్యోగులను బదిలీలు చేసేందుకు ప్రభుత్వం నేడో, రేపో జీవో జారీ చేయనుంది. ప్రస్తుతం వాట్సాప్ గ్రూప్‌ల్లో చక్కెర్లు కొడుతున్న జీవో ఫేక్‌గా తేలింది. ఉద్యోగుల బదిలీల విధివిదానాలు ఇంకా తెలియనప్పటికీ పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ విభాగం, రెవెన్యూ, లాండ్స్, సివిల్ సప్లయ్, గనులు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు బదిలీలు ఉంటాయని తెలుస్తోంది. ప్రజలతో నేరుగా సంబంధాలున్న శాఖలు కావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. విద్య, వైద్యం, వ్యవసాయం, వెటర్నరీ, ఎక్సైజ్, ఇతర శాఖల్లో బదిలీలు ఇప్పుడుండవని సమాచారం. అయితే గ్రామ, వార్డు సచివాలయాల్లో వైద్య ఆరోగ్య శాఖ విధులు నిర్వహిస్తున్న హెల్త్ (ఏఎన్ఎం), వ్యవసాయ శాఖకు చెందిన అగ్రికల్చర్, పశుసంవర్ధక శాఖకు చెందిన వెటర్నరీ అసిస్టెంట్ (సెక్రటరీలు)లకు కూడా బదిలీలు ఉండకపోవచ్చునంటున్నారు. బదిలీల జీవోలో విధివిదానాలు వచ్చాక వీటిపై స్పష్టత రావొచ్చు.


- ఐదేళ్లు ఒకేచోట పనిచేసే ఉద్యోగులకు బదిలీ ఉంటుంది. గిరిజన ప్రాంతాల్లో రెండేళ్ల పనిచేసేవారంతా బదిలీలను కోరుకోవచ్చు. ఐదేళ్లు, రెండేళ్లతో పని లేకుండా ఆరు నెలల క్రితం బదిలీపై వచ్చిన వారు కూడా అనుకూలమైన స్థానాలకు ప్రజాప్రతినిధుల సిఫార్సులతో వెళ్లేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రచారం జరుగుతుండడంతో రాజకీయ పలుకుబడి లేని ఉద్యోగుల్లో భయం పట్టుకుంది. పరిపాలన అవసరాల మేరకు ట్రాన్స్‌ఫర్ పేరుతో ఎక్కడకు విసిరేస్తారోనన్న టెన్షన్ వారిలో ఉంది. ప్రధానంగా గ్రామ, వార్డు సచివాలాయల్లో పని చేస్తున్న ఉద్యోగుల్లో చాలా మంది ఎటువంటి రాజకీయ పలుకుబడి లేనివారే.

వారికి ప్రాధాన్యం

పూర్తి దృష్టిలోపం ఉన్నవారికి బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తారు. వాస్తవానికి వీరిని ఉన్నచోట నుంచి కదిలించరు. వారు కోరుకుంటే మాత్రం తప్పకుండా బదిలీ చేస్తారు. వైకల్యం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పిల్లలున్నా.. అనారోగ్యానికి గురైన తల్లిదండ్రులు ఉన్నా..బదిలీల్లో తప్పకుండా ప్రాధాన్యమిస్తారు. కారుణ్య నియామకాలు, వితంతు ఉద్యోగులకు సైతం ప్రయారిటీ ఇస్తారు. మరోవైపుబదిలీల నేపథ్యంలో రెవెన్యూ గ్రామసభలను రద్దుచేశారు.

పారదర్శకంగా ప్రక్రియ

టీడీపీ ప్రభుత్వ హయాంలో పారదర్శకంగా బదిలీల ప్రక్రియ జరుగుతుందన్న పేరు ఉంది. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చినప్పుడు ఆన్‌లైన్‌లో బదిలీ ప్రక్రియ చేపట్టింది. అప్పట్లో దాదాపు అన్ని శాఖల్లో బదిలీలు చేపట్టారు. ఉన్నతాధికారుల నుంచి సిబ్బంది వరకూ బదిలీ అయ్యారు. పారదర్శకంగానే ప్రక్రియను పూర్తిచేశారు. ఇటీవల మంత్రి వర్గ సమావేశంతో పాటు పార్టీ అంతర్గత సమావేశాల్లో సైతం సీఎం చంద్రబాబు బదిలీలపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్టు తెలుస్తోంది. బదిలీల విషయంలో ఎవరూ మితిమీరిన జోక్యం చేసుకోవద్దని చెప్పినట్టు సమాచారం.



జేసీ సేతు మాధవన్ బాధ్యతల స్వీకరణ



కలెక్టరేట్, ఆగస్టు 14: జాయింట్ కలెక్టర్‌గా సేతు మాధవన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ జేసీగా పనిచేసిన కె.కార్తీక్ నెల్లూరుకు బదిలీపై వెళ్లారు. సేతు మాధవన్ పార్వతీపురం ఐటీడీఏ పీవోగా పని చేస్తూ జిల్లాకు బదిలీపై వచ్చారు. తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా కందికుప్పం గ్రామానికి చెందిన సేతుమాధవన్ సివిల్ ఇంజనీరింగ్ చదివి 2011లో సివిల్స్‌కు ఎంపికయ్యారు. శిక్షణానంతరం ప్రకాశం జిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా, ఆ తరువాత మార్కాపురం సబ్ కలెక్టర్‌గా, ఎంఎస్ఎంఈ శాఖలో సీఈవోగా పనిచేశారు. నెల్లూరు జేసీగా పనిచేసి కొద్దిరోజుల క్రితమే పార్వతీపురం ఐటీడీఏ పీవోగా బదిలీపై వచ్చారు. ఆయన భార్య శోభిక ప్రస్తుతం పార్వతీపురం మన్యం జేసీగా పనిచేస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన మాధవన్‌కు డీఆర్‌వో అనిత, ఆర్‌డీవోలు సూర్యకళ, సాయిశ్రీ, శాంతి, ఎస్‌డీసీలు, తహసీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. సేతు మాధవన్ జేసీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి



మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి

విజయనగరం క్రైం, ఆగస్టు 14: కాలానుగుణంగా వస్తున్న మార్పులను గమనిస్తూ ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని పనితీరును మెరుగు పరుచుకోవాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి సూచించారు. విశాఖ రేంజ్ డీఐజీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాకు మొదటిసారిగా బుధవారం వచ్చిన ఆయనకు ఎస్పీ వకుల్‌జిందాల్, ఐదో బెటాలియన్ కమాండెంట్ మల్లికాగార్గ్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త తరహాలో నమోదవుతున్న డ్రగ్స్, సైబర్ నేరాలను దర్యాప్తు చేసేందుకు అవసరమైన మెలకువలను పోలీసులు అందిపుచ్చుకోవాలన్నారు. సుప్రీం కోర్టు, హైకోర్టు వెలువరించిన తీర్పులను పరిశీలన చేసుకోవాలని... సంబంధిత చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. గంజాయి రవాణా నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, సమర్థమైన అధికారులను గుర్తించి ప్రోత్సహిస్తామని, అలాగే తప్పులు చేసే అధికారులు, సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు.

ఏడుగురు ఎస్ఐల బదిలీ

విజయనగరం, క్రైం, ఆగస్టు14: జిల్లాలో ఏడుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. బొండపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న కె.లక్ష్మణరావును గజపతినగరం స్టేషన్‌కు, గజపతినగరంలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ యు.మహేష్‌ను బొండపల్లి స్టేషన్‌కు బదిలీ చేశారు. విజయనగరం పీటీసీలో విధులు నిర్వహిస్తున్న డి.సాయికృష్ణను గంట్యాడ పోలీస్ స్టేషన్‌కు, విజయనగరం రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న జి.రాజేష్‌ను బూర్జువలస స్టేషన్‌కు, బాండంగి ఎస్ఐ ఆర్.జయంతిని పెదమానాపురం స్టేషన్‌కు, సంతకవిటి ఎస్ఐ ఎస్.శంకర్‌ను వంగర స్టేషన్‌కు, పూసపాటిరేగ ఎస్ఐ ఎ.సన్యాసినాయుడును డెంకాడ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. వీరు కొత్త స్థానాల్లో వెంటనే చేరనున్నారు.

పిచ్చిమొక్కలు.. ముళ్ల కంపలు

● ఇదీ గుర్ల మండలంలో తోటపల్లి కాలువల పరిస్థితి

గుర్ల: మండలంలో తోటపల్లి కాలువల నిర్వహణ గాడితప్పింది. పిచ్చిమొ క్కలు.. ముళ్ల కంపలు పేరుకుపోవడంతో ఖరీఫ్‌లో సైతం ఆయకట్టుకు నీరందడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రధానంగా కాలువల్లో ఏళ్ల తరబడి కనీస మరమ్మతులకు నోచుకోవడం లేదు. కనీసం పిచ్చిమొక్కలు సైతం తొలగించడం లేదని రైతులు ఆందోళన చేస్తున్నారు. నెలరోజుల నుంచి కాలువ శుభ్రం చేస్తామని, సాగు నీరందిస్తామని చెప్పడమే తప్ప ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని రైతులు వాపోతున్నారు. రైతులకు అవసరమయ్యే సమయంలో నీరందకపోతే, తర్వాత ఇస్తే మాత్రం ఉపయోగం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. తోటపల్లి రిజర్వాయర్ నుంచి సాగునీరు ఈ ప్రాంతంలోకి వస్తే కొంతమేర ఉపయోగపడుతుందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలను శుభ్రం చేసి సాగునీటిని అందించాలని రైతులు కోరుతున్నారు.


తుప్పలతో నిండిన తోటపల్లి కాలువ

సోలార్ వైర్ల దొంగ దొరికాడు

గుర్ల: సోలార్ వైర్లు దొంగతనం చేసే వ్యక్తి పోలీసులకు చిక్కాడు. అదే మండలానికి చెందిన వ్యక్తి సైకిల్‌పై విజయనగరం వెళుతూ ఈ దొంగతనం చేస్తున్నట్టు తెలిసింది. దొంగతనం చేసే వ్యక్తి విషయం ప్రజాప్రతినిధులు ఎన్నిసార్లు పోలీసు అధికారులకు చెప్పినా పట్టించుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దొంగిలించే వ్యక్తి రాత్రి 7 నుంచి 10 గంటలలోపు తన ద్విచక్ర వాహనంపై పల్లిగండ్రేడు నుంచి బయలుదేరి విజయనగరం వెళుతుంటాడని సమాచారం. గడచిన ఆరు నెలల్లో గుజ్జంగివలస, గూతడెం, పాలవలస, నక్కలపేట, ఆనందపురం, పల్లిగండ్రేడు, కొండగండ్రేడు, జమ్ముపేట, వల్లాపురం తదితర గ్రామాల్లో సోలార్ వైర్లు కట్ చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. వాటిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇంతవరకు అతీగతీ లేదు. గుజ్జంగివలసలో సోలార్ వైర్ల చోరీ విషయం పెద్ద రాజకీయ దుమారం లేపింది. ఇటీవల పోలీసులు దొంగతనం చేసిన వారిని పట్టుకున్నారని తెలిసింది. గుట్టుచప్పుడు కాకుండా పోలీసులు వ్యవహరిస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై స్థానిక ఎస్‌ఐ భాస్కరరావును వివరణ కోరగా.. ఈమధ్యకాలంలో వైర్లు దొంగతనంచేసిన వారిని పట్టుకున్నామని, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. బ్యాటరీలు, ట్రాన్స్‌ఫార్మర్లు దొంగతనం చేసిన వారు కూడా దొరికారని తెలిపారు. పూర్తి సమాచారం సేకరించి, దర్యాప్తు చేసి వెలుగులోకి తెస్తామన్నారు.

ఎరుమేలి చేరిన అయ్యప్పల పాదయాత్ర

చీపురుపల్లి: పీకే పాలవలసకు చెందిన అయ్యప్ప స్వాములు చేపట్టిన పాదయాత్ర బుధవారం నాటికి ఎరుమేలికి చేరింది. ఆ గ్రామానికి చెందిన వలిరెడ్డి శ్రీరాములు గురుస్వామి నేతృత్వంలో ఎం.మోహన్, జి.కృష్ణ తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తే కాలి నడకన అయ్యప్ప కొండకు వెళ్లాలనుకున్నారు. ఈ మేరకు జూన్ 2న పాదయాత్ర ప్రారంభించారు. బుధవారం ఎరుమేలి చేరుకొని వావర్ స్వామిని దర్శించు కున్నట్టు శ్రీరాములు తెలిపారు. ఇప్పటి వరకూ 1420 కి.మీ. పూర్తి చేశామని, మరో 50 కి.మీ. నడిచి, ఈ నెల 17న స్వామిని దర్శించుకోనున్నట్టు శ్రీరాములు తెలిపారు.


అయ్యప్ప స్వాముల పాదయాత్ర

పీహెచ్‌సీలో అధిక ప్రసవాలు చేయాలి

● డీఎంహెచ్‌వో భాస్కరరావు


రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

భోగాపురం: పోలిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భాస్కరరావు బుధవారం పరిశీలించారు. రికార్డులు, ఓపీ, ఆసుపత్రి ఆవరణ, సిబ్బంది హాజరు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలోనే డెలివరీలను అధికంగా చేసేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. బి.సి.జి. టీకాల లక్ష్యం పూర్తి చేయాలన్నారు. జ్వర బాధితులను పర్యవేక్షిస్తూ వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో చంద్రశేఖర్‌రాజు, డా.వెంకటేష్, హెచ్‌ఎ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు దూరంగా ఉండాలి

● జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి విజయ్ కళ్యాణి



మాట్లాడుతున్న విజయ్‌కళ్యాణి

గంట్యాడ: బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి కె.విజయ్ కళ్యాణి కోరారు. బుధవారం తాటిపూడి రిజర్వాయర్ అవల ఉన్న డికెపర్తి, అడ్డతీగ, మునలి కంటి గ్రామాల్లో న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందకపోతే న్యాయ సేవ సంప్రదించాలని కోరారు. ఎవరికైనా అందకపోతే 15100 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలోని ఆర్ఐ హరిప్రియ, సర్పంచ్ సీతమ్మ పాల్గొన్నారు.

నెల్లిమర్ల ఎంపీడీవోగా గిరిబాల

నెల్లిమర్ల: నెల్లిమర్ల ఎంపీడీవోగా జి.గిరిబాల బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల ముందు ఇక్కడ పనిచేసి శ్రీకాకుళం జిల్లాకు బదిలీపై వెళ్లిన ఆమెను తిరిగి ఇక్కడే నియమించారు. ఇక్కడ ఇంత వరకు ఎంపీడీవోగా పనిచేసిన జి.రామారావు పూసపాటిరేగ మండల పరిషత్ కార్యాలయం పరిపాలన అధికారిగా వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గిరిబాలకు కార్యాలయ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు అభినందించారు.



విజయనగరం: ర్యాలీ నిర్వహిస్తున్న బీజేవైఎం ప్రతినిధులు



వంగర: మహిళా సంఘాల ర్యాలీ


రాజాం రూరల్: పెనుబాక పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన


బొబ్బిలిలో జాతీయ పతాకాలను ఆవిష్కరిస్తున్న గ్రీన్ బెల్ట్ సభ్యులు

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

● జిల్లా వ్యాప్తంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహించారు. చీపురుపల్లిలో బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో 500 అడుగుల జాతీయ జెండాను ఊరేగించారు. మెయిన్ రోడ్డులోని గాంధీ బొమ్మ జంక్షన్ నుంచి మూడు రోడ్ల కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు.

-ఆంధ్రజ్యోతి బృందం


బొబ్బిలి: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న మునిసిపల్ ఉద్యోగులు


ఎస్.కోట: కుటుంబిషన్ కేంద్రం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న మహిళలు


గంట్యాడ: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


చీపురుపల్లి: జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న యువకులు

జూట్ మిల్లు సమస్య పరిష్కారానికి కృషి

● నెల్లిమర్ల ఎమ్మెల్యే నాగమాధవి


రక్తదానం చేస్తున్న యువకులను అభినందిస్తున్న నాగమాధవి

నెల్లిమర్ల: నెల్లిమర్ల జూట్ మిల్లు సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. బుధవారం నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో నల్లి రాజు, నల్లి సాయి సోదరులు మెగాస్టార్ చిరంజీవి జన్మదినం పురస్కరించుకుని రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల్లిమర్ల జూట్ మిల్లు సమస్య తన దృష్టికి వచ్చిందని, మిల్లు యాజమాన్యంతో మాట్లాడినట్లు తెలిపారు. శిబిరంలో 50 మంది యువకులు రక్తదానం చేశారు.కాగా గ్రామంలో కిల్లంపల్లి రామారావుతో పాటు పలువురు నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో జనసేన గల్ఫ్ దేశాల సమన్వయ కర్త చందక రామదాసు, రత్నం, నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, జనసేన నాయకులు ఎంఎం నాయుడు, నల్లి శేఖర్, ఎం.అప్పన్న, తుమ్ము వెంకటరమణ, టీడీపీ నాయకులు కడగల ఆనంద్‌కుమార్, అవనాపు సత్యనారాయణ కింతాడ కళావతి పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

గజపతినగరం: గజపతినగరంలోని వాసవిట్రైడర్స్ రైస్ మిల్లులో బుధవారం పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బి.సింహాచలం తెలిపారు. ఇంకోలు సన్యాసిరావు ఆటోలో ముప్పిడి గణేష్ బియ్యం తరలిస్తుండగా 1,530 కేజీల బియ్యం (58 బస్తాలు) పట్టుకున్నట్లు తెలిపారు. బైరెడ్డి సత్యనారాయణకు చెందిన లారీ, వాహనంలో 410 బ్యాగ్‌ల బియ్యం పట్టుబడగా వీటిని కాటావేయాల్సి ఉందన్నారు. ఈ రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన బియ్యం, సీజ్‌చేసిన వాహనాలను సీఎస్‌డీటీ రవిశంకర్‌కు అప్పగించినట్లు చెప్పారు. వాహనాలను పోలీస్ స్టేషన్‌కు, పట్టుబడిన బియ్యం ఎం.ఎల్‌ఎస్ పాయింట్‌కు తరలించినట్లు సీఎస్‌డీటీ తెలిపారు. కాగా పట్టు బడినవారిపైకేసులు నమోదు చేసినట్లు తెలిపారు.


పట్టుబడిన పీడీఎస్ బియ్యం

ఆధ్యాత్మికం వైపు దృష్టి సారించాలి

● దుర్గాపీఠం పీఠాధిపతి శ్రవణచైతన్య చిన్న స్వామి

నెల్లిమర్ల: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికం వైపు దృష్టిసారించాలని తామస్‌పేట దుర్గా మహా పీఠం పీఠాధిపతి శ్రవణ చైతన్యానంద చిన్న స్వామి పిలుపునిచ్చారు. బుధవారం దుర్గాపీఠం వ్యవస్థాపక పీఠాధిపతి సమతానంద స్వామిజీ ప్రథమ వార్షిక ఆరాధనోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోజంతా దుర్గాపీఠంలో యాగాలు, భజనలు, కీర్తనలు నిర్వహించారు. సమతానంద స్వామిజి విగ్రహానికి చిన్న స్వామి పూలమాల వేసి నివాళులర్పించారు. కాగాతామస్‌పేటలోని దుర్గాపీఠంలో సమతానంద స్వామి ఆరాధనోత్సవాలు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. పీఠం అభివృద్ధికి తన వంతు సహకరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, టీడీపీ నాయకులు గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, అవనాపు సత్యనారాయణ, వానపల్లి వీరభద్రరావు, కింతాడ కళావతి పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ


విచారణ చేపడుతున్న ఏపీడీ అరుణశ్రీ

మెంటాడ: మండలంలోని చింతాడవలస ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ రామునాయుడుపై స్థానికుల ఫిర్యాదు మేరకు డ్వామా ఏపీడీ అరుణశ్రీ బుధవారం విచారణ నిర్వహించారు. తక్షణమే ఆయన్ను తప్పించి అర్హులైనవారిని నియమించాలని స్థానికులు కోరారు. విచారణ నివేదికను తదుపరి చర్యలు నిమిత్తం ప్రాజెక్టు డైరెక్టర్‌కు నివేదిస్తానని ఏపీడీ అరుణశ్రీ చెప్పారు. అయితే తాను ఉద్దేశ పూర్వకంగా తప్పు చేయలేదని, కంప్యూటర్ ఆపరేటర్ తప్పిదం వల్ల అలా జరిగిందని, రెండు పర్యాయాలు విచారణ జరిపారని తాను చేసిన లోపాలు రుజువు కాలేదని ఫీల్డ్ అసిస్టెంట్ ఏపీడీ ఎదుట చెప్పారు. కాగా స్టేట్‌మెంట్ రికార్డు చేశారు.

అంగన్‌వాడీ పిల్లలకు దుస్తుల పంపిణీ

భోగాపురం: మండలంలో 12 అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన 83 మంది పిల్లలకు సుమారు రూ.50వేల విలువ చేసే దుస్తులను చాకివలస టీడీపీ నేత, మాజీ సర్పంచ్ లంక రామనర్సు బుధవారం అందజేశారు. ఎంఈవో రమణమూర్తి, టీడీపీ నాయకులు వి.సుందరరావు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరంలో బొబ్బిలి వీరులు

స్వాతంత్ర్య ఉద్యమంలో బొబ్బిలి వీరులు కీలక పాత్ర పోషించారు. దశల వారీగా జరిగిన నిరసనల్లో పాల్గొని బ్రిటీష్ వారిపై అలుపెరుగని పోరాటం చేశారు. ఆ క్రమంలో లాఠీదెబ్బలు తిన్నారు. జైలు జీవితం అనుభవించారు. ఆ మహానుభావుల్లో బొబ్బిలి ఆఖరి సంస్థానాధీశులు రాజా ఆర్‌ఎస్‌ఆర్‌కె రంగారావుది(బొబ్బిలి రాజా) మ హోన్నతమైన ప్రస్థానం. సంస్థానం పాఠశాలను స్థాపించి దేశానికి విద్యావంతులను అందించారు. లండన్‌లో జరిగిన రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. బొబ్బిలి గాంధీగా పేరొందిన అయ్యగారి నారాయణమూర్తి గాంధీజికి అడ్డుగా నిలిచి లాఠీదెబ్బలు తిన్నారు. బొబ్బిలి పట్టణానికే చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే గోనా సీతారామస్వామి సహాయనిరాకరణ ఉద్యమంలో గాంధీజీతో కలిసి అడుగులు వేశారు.

ఉద్యమ కాలం నాటి సంస్థానం పాఠశాల



బొబ్బిలి, ఆగస్టు 14: బొబ్బిలి పట్టణంలో బ్రిటీష పరిపాలనా కాలంలో 1864లో మద్రాసు ఉమ్మడి రాష్ట్రాల సీఎంగా పనిచేసిన స్థానిక ఆఖరి సంస్థానాధీశులు రాజా ఆర్‌ఎస్‌ఆర్‌కె రంగారావు బాలబాలికల కోసం పాఠశాలను ఏర్పాటు చేశారు. సంస్థానం మిడిల్ స్కూల్‌గా ఏర్పాటైన ఈ పాఠశాల ఉన్నత పాఠశాలగా 1882లో అప్‌గ్రేడ్ అయింది. 'యు' ఆకారంలో భవనాలతో విశాలమైదానంతో పాఠశాలను తీర్చిదిద్దారు. 1908లో మరిన్ని హంగులు సమకూర్చారు. క్రమశిక్షణ, నాణ్యమైన విద్యకు పెట్టింది పేరుగా జాతీయస్థాయిలో ఈ స్కూలు గుర్తింపు పొందింది. త్రివిధ దళాల అధిపతిగా పనిచేసిన జనరల్ కేవీ కృష్ణారావు ఇక్కడ విద్యార్థే. హెచ్‌ఎం కార్యాలయం నుంచి అన్ని తరగత గదులకు సమాచారం అందించేలా బ్రిటీష కాలంలోనే రేడియోను ఏర్పాటు చేశారు. అత్యున్నతమైన లైబ్రరీని స్థాపించారు.

● పాఠశాల వ్యవస్థాపకులైన రాజా ఆర్‌ఎస్‌ఆర్‌కె రంగారావు స్వతహాగా పోలో క్రీడాకారుడు కావడంతో విశాలమైదానాన్ని సమకూర్చి అందరినీ విశేషంగా ప్రోత్సహించారు. ఆటల్లో జాతీయస్థాయిలో నాటి యువత రాణించేవారు.

దేవాలయంగా భావించేవారు

గోనా అప్పారావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, బొబ్బిలి

బొబ్బిలి రాజా రంగారావు చాలా కఠినమైన క్రమశిక్షణ కలిగి ఉండేవారు. ఆయన లక్ష్యం మేరకు సంస్థానం పాఠశాలను అంతే కఠోరమైన క్రమశిక్షణతో అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ పాఠశాలను ఓ దేవాలయంగా భావించేవారు. అత్యుత్తమ గ్రంథాలతో కూడిన వేలాది పుస్తకాలతో ఉన్న లైబ్రరీలో జాతీయోద్యమ స్ఫూర్తిని కలిగించే పుస్తకాలు అందుబాటులో ఉండేవి.

సహాయనిరాకరణ ఉద్యమంలో సీతారామస్వామి



బొబ్బిలి, ఆగస్టు 14: బొబ్బిలి పట్టణానికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే గోనా సీతారామస్వామి 1921లో మహాత్మాగాంధీతో పాటు సహాయ నిరాకరణ ఉద్యమంలో చురుగ్గా పనిచేశారు. హిందీ భాషోద్యమంలో కూడా పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీలో అనేక కీలక పదవులు నిర్వహించారు. బొబ్బిలి జమీన్ రైతు, హరిజన్, యువజన వ్యవహారాల అధ్యక్షునిగా పనిచేశారు. 1933లో గుంటూరులో బ్రిటీష ప్రభుత్వం నిషేధించిన ఆంధ్ర పొలిటికల్ కాంగ్రెస్ సమావేశానికి, 1932 లో కోల్‌కతాలో నిషేధించిన కాంగ్రెస్ సమావేశానికి హాజరై ఆయన లాఠీచార్జీలు, జైలుశిక్ష అనుభవించారు. 1946-52లో ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభ్యునిగా పనిచేశారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో బొబ్బిలి రాజా

బొబ్బిలి, ఆగస్టు 14: 1931లో లండన్‌లో జరిగిన రెండో రౌండ్‌టేబుల్ సమావేశంలో బొబ్బిలి 13వ రాజా ఆర్‌ఎస్‌ఆర్‌కె రంగారావు హాజరయ్యారు. గాంధీ నేతృత్వంలో హాజరైన భారతబృందంలో ఆయన ఒకరు. 1931-36 లో కాంపోజిట్ మద్రాసు రాష్ట్రానికి ప్రీమియర్‌గా బొబ్బిలి రాజా వ్యవహరించారు. మాజీ మంత్రి ఆర్‌వి సుజయ్‌కృష్ణరంగారావుకు ఆర్‌ఎస్‌ఆర్‌కె రంగారావు స్వయానా తాతగారు.


గాంధీకి రక్షణగా..

● లాఠీదెబ్బలు తిన్న అయ్యగారి నారాయణమూర్తి



బొబ్బిలి: స్వాతంత్ర్య ఉద్యమంలో పాలుపంచుకున్న అయ్యగారి నారాయణమూర్తి బొబ్బిలి గాంధీగా పేరు తెచ్చుకున్నారు. పట్టణంలోని చర్చివీధి సెంటరులో ఉండే నారాయణమూర్తి అసోసి యేట్ మెంబర్ ఆఫ్‌ది అమెరికన్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో డిప్లమో చదువుకున్నారు. కొన్నాళ్లపాటు సంస్థానం ఉన్నత పాఠశాలలో పనిచేసి కళాకారునిగా, వక్తగా గుర్తింపు పొందారు. కాకినాడలో జరిగిన కాంగ్రెస్ మహాసభలకు హాజరైనప్పుడు బ్రిటీష వారు అనేక అడ్డంకులు సృష్టించినప్పటికీ కాకినాడ చేరుకోగలిగారు. సభ జరుగుతుండగా గాంధీని కొట్టి చంపేందుకు బ్రిటీష సిపాయిలు దూసుకువస్తున్న సమయంలో నారాయణమూర్తి ఒక్క ఉదుటున ముందుకు వెళ్లి గాంధీ ఒంటిపై లాఠీదెబ్బలు పడకూడదన్న తపనతో తన రెండు చేతులు అడ్డంగా పెట్టి నిలువరించారు. లాఠీ దెబ్బలకు నారాయణమూర్తి చేతులు రెండూ చచ్చుబడిపోయాయి. అప్పటి నుంచి బొబ్బిలి గాంధీగా ఆయనను పిలిచారు.

తల్లిదండ్రుల పేరు నిలబెట్టిన తనయులు



బొబ్బిలి: అమ్మానాన్నల ప్రోద్బలంతో స్వాతంత్ర్య ఉద్యమంలోకి దుమికి బ్రిటీష వారి దాష్టీకానికి గురైన బొబ్బిలి సోదరులు అయ్యగారి రామపాపారావు, సూర్యనారాయణరావులు పోలీసుల లాఠీదెబ్బలు, జైలు జీవితం అనుభవించారు. గాంధీ పిలుపును అందుకొని ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొన్నారు. బొబ్బిలి తహసీల్దారు కార్యాలయం ఎదుట సత్యాగ్రహాన్ని ప్రారంభించిన సూర్యనారాయణ రావును అరెస్టు చేసి బళ్లారి జైలుకు తరలించారు. ఆరునెలల జైలు శిక్ష అనుభవించారు. ఆయన సోదరుడు రామపాపారావు తన స్నేహితులందరినీ వెంటపెట్టుకొని జాతీయజెండాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆ క్రమంలో జైలుకు వెళ్లాల్సి వచ్చింది.

మహాత్ముడికి నిత్య పూజ

రాజాం రూరల్, ఆగస్టు 14: ఆయనో సాధారణ కూలీ.. దినసరి భత్యంతోనే కుటుంబాన్ని సాకుతున్న సగటు మనిషి.. అయితేనేం.. విపరీతమైన దేశాభిమానం.. గాంధీజీ అంటే వల్లమాలిన ప్రేమ.. తన దినచర్యలో భాగంగా ఇంటినుంచి బయటకు వెళ్తున్న ఆయన ఎండకు ఎండి, వానకు తడిసే స్థితిలో ఉన్న మహాత్ముడి విగ్రహం చూశాడు.. చలించిపోయిన ఆయన ఆ విగ్రహాన్ని అక్కడి నుంచి తరలించాడు.. కుటుంబ అవసరాల కోసం దాచుకున్న మొత్తం నుంచి కాస్త నగదును తీసి చిన్నపాటి షెల్టర్ ఏర్పాటు చేయించి అక్కడే మహాత్ముడి విగ్రహాన్ని నెలకొల్పాడు.. నిత్యం తన ఇంటి నుంచి పనిచేసే చోటుకు వెళ్తూ గాంధీ పాదాల చెంత ఓ పూవును పెట్టి దండం పెడతాడు. ఇలా మూడు నెలలు, మూడేళ్లు కాదు ఏకంగా మూడు దశాబ్దాలుగా ఈ ఆనవాయితీని కొనసాగిస్తూ అందరి మన్ననలు పొందుతున్న ఆ వ్యక్తి రాజాం పట్టణానికి చెందిన అలమలకల పైడిరాజు అలియాస్ వెంకన్న.



● **1990లో...**

గ్రామస్థాయిలో నాటకాలు ప్రదర్శించే నాటక సమాజం సభ్యులు 1990లో నాటకాన్ని ప్రదర్శించేందుకు రాజాం వచ్చారు. నాటక ప్రదర్శనలో మహాత్ముడి విగ్రహం అవసరం కావడంతో తమతో గాంధీ విగ్రహాన్ని తెచ్చిన నటులు ప్రదర్శన పూర్తయ్యాక కుమ్మరివీధిలో గ్రామదేవత సన్నిధిలో విడిచిపెట్టేశారు. ఆ విగ్రహాన్ని చూసిన వెంకన్న విగ్రహాన్ని అక్కడి నుంచి తీసుకెళ్లి సెగిడివీధిలో తాత్కాలికంగా చిన్నపాటి షెల్టర్ నిర్మించి అక్కడ విగ్రహాన్ని పెట్టి నిత్యపూజలు చేయడం ప్రారంభించాడు.

ఢిల్లీ వేడుకల్లో జిల్లా సర్పంచ్‌లు..

చీపురుపల్లి, ఆగస్టు 14: దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్న స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు జిల్లా నుంచి ఐదుగురు సర్పంచ్‌లు హాజరవుతున్నారు. విజయనగరం మండలంలోని ద్వారపూడి, చెల్లూరు, చీపురుపల్లి నుంచి రావివలస, పుర్రేయవలస, రాజాం నుంచి ఒమ్మి గ్రామ సర్పంచ్‌లు ఈ వేడుకలకు ఎంపికైనట్టు సమాచారం అందింది. ఆయా పంచాయతీల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు చేయడంలో మెరుగైన పనితీరును కనబరిచినట్టు కేంద్ర ప్రభుత్వ అధికారులు తమ ఆహ్వానంలో పేర్కొన్నారు. కాగా సమాచారం అందుకున్న రావివలస, పుర్రేయవలస సర్పంచ్‌లు పనస జానకి రామమణికంఠ, సారిక మోహనరావులు ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నారు.



ఢిల్లీలోని పాత పార్లమెంట్ భవనం వద్ద జిల్లా సర్పంచ్‌లు

నిందితులను కఠినంగా శిక్షించాలి

విజయనగరం రింగురోడ్డు: పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో వైద్యురాలిపై హత్యచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టరు జేసీ నాయుడు డిమాండ్ చేశారు. బుధవారం కంటోన్మెంట్‌లోని మృతురాలికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు వైద్యం అందించే వైద్యులపైన దాడులు చేయడం హత్యలు చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఐఎంఏ పూర్వ అధ్యక్షుడు వీఎస్ ప్రసాద్, ప్రతి నిధులు అశోక్, మహేంద్రగిరి, లంకా శ్రీనివాసరావు, త్రినాథ్‌రావు, ఎం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'ఉచిత బస్సువల్ల ఉపాధి కోల్పోతాం'

విజయనగరం దాసన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోతున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై పునరాలోచన చేయాలని విజయదుర్గా ఆటో వర్కర్స్ యూనియన్(ఏఐఎఫ్‌టీయూ) అనుబంధ సంస్థ జిల్లా అధ్యక్షుడు నీలాపు అప్పలరాజు రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో సుమారు 5 లక్షల పైచిలుకు ఆటో డ్రైవర్లు ఉపాధి పొందుతున్నారని, ఉచిత బస్సు వల్ల ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.

రేషన్ డీలర్ల బకాయిలు వెంటనే చెల్లించాలి

రాజాం రూరల్: అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకాలకు సంబంధించిన కమిషన్ బకాయిలను వెంటనే చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేయాలని రేషన్ డీలర్ల సంఘ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఉమాగౌరి ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో తీసుకున్న నిర్ణయాలు రేషన్ డీలర్ల జీవనానికి ఊరట కలిగించే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు.

పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాలు

సంతకవిటి: బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి మందరాడకు చెందిన ఎస్‌ఆర్‌ఐ లెంక జగన్, ఎస్‌టీ పొట్టి రామకృష్ణ, కృష్ణారావు, చక్రి తదితరులు ఇంగ్లీషు, తెలుగు పుస్తకాలు అందజేశారు. వీటిని హెచ్‌ఎం మల్లేశ్వరరావు, ఉపాధ్యాయుడు దామోధరరావు, పాఠశాల చైర్మన్‌లకు అందజేశారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

సంతకవిటి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం బ్యాగులు పంపిణీ చేశారు. ఎం.పి. కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ వీటిని అందజేశారు. విద్యార్థులు ప్రయోజకులై, తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకురావాలని సూచించారు. కొల్ల అప్పలనాయుడు, గట్టి భాను, రఘు బాబు, గణేష్ తదితరురలు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో ఉంగరాడమెట్ట ప్రథమం

రేగిడి: స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా మండల విద్యాశాఖ నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఉంగరాడమెట్ట గురకుల పాఠశాల ప్రథమ, దేవుదళ కేజీబీవీ ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ఎంఈఓలు వరప్రసాదరావు, ఎరకయ్యలు తెలిపారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు చెప్పారు.

సోలార్ దీపాలు ఏర్పాటుకు సిద్ధం

లక్కవరపుకోట: మండలంలోని మల్లివీడు, కొత్తపాలెం గ్రామాల్లో సోలార్ దీపాల ఏర్పాటుకు బల్లారికి చెందిన పీవీఎస్‌ఆర్ స్టీల్ అండ్ పవర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్ బోని సన్యాసిరావు ముందుకొచ్చారు. ఇందుకు సంబంధించిన వివరాలను స్థానిక ఎమ్మెల్యే లలితకుమారికి, జిల్లా కలెక్టర్ దృష్టిలో పెట్టినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా గ్రా మాలకు దీపాలు కావాలంటే ప్రభుత్వ సబ్సిడీ పోను మిగ తా సొమ్మును తాను భరిస్తానని చెప్పారు. సన్ని స్వగ్రామం మల్లివీడు కావడంతో మొదటి ప్రాధాన్యం ఇచ్చినట్టు తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహావిష్కరణ

సంతకవిటి: తాలాడ గ్రామంలో నిర్మించిన స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న, ముగ్గు జగన్నాథంనాయుడుల విగ్రహాలను బుధవారం రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, విజయనగరం ఎం.పి. కలిశెట్టి అప్పలనాయుడు ఆవిష్కరించారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ లచ్చన్న కృషి ఫలితంగానే నేడు స్థానిక సంస్థల్లో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం లభిస్తోందని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ మాట్లాడుతూ గౌతు లచ్చన్న దళితులకు దేవాలయాలలో ప్రవేశాలు కల్పించారని కొనియాడారు. ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో ఇచ్ఛాపురం నుంచి మద్రాసు వరకు పాదయాత్ర చేసిన నాయకుడు గౌతు లచ్చన్న అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తూర్పు కాపు మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు గట్టి భాను, వల్లూరు గణేష్, పిన్నింటి మోహన్‌రావు, కిమిడి అశోక్‌బాబు, దూబ ధర్మారావు, ముగ్గు రామారావు, గురవాన నారాయణరావు, లచ్చుభుక్త కృష్ణమూర్తి, మొయ్యి నారాయణప్పడు, గరుగుబిల్లి రాణాప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణలో కోండ్రు, గౌతు శిరీష, ఎంపీ కలిశెట్టి

పాఠశాలలను సందర్శించిన న్యాయాధికారి

కొత్తవలస, ఆగస్టు 14: కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ సముద్రాల విజయచందర్ బుధవారం మండలంలోని తుమ్మికాపల్లి పంచాయతీ పరిధిలోని కస్తూర్బా పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు సంబంధించిన మౌలిక వసతులు ఉన్నాయా? లేదా? అనే విషయాలపై ఆరా తీశారు. పాఠశాలలో కొంతవరకు పారిశుధ్యలోపం ఉన్నట్టు గుర్తించారు. విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు వంటివి అందాయా? లేదా? ఇంకాఏమైనా పుస్తకాల కొరత ఉందా? సరిపడినంత మంది ఉపాధ్యాయులా? ఉన్నారా? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయమూర్తితో పాటు కోర్టు సిబ్బంది, న్యాయవాద సంఘం ప్రతినిధులు డీ.శ్రీనివాస్, జీవీ రమణ, గవరకృష్ణ పాల్గొన్నారు. ● **వేపాడ:** మండలంలోని వేపాడ బక్కునాయుడుపేట వద్ద గల కస్తూర్బా బాలిక పాఠశాలను బుధవారం కొత్తవలస కోర్టు సివిల్ న్యాయాధికారి డాక్టర్.సముద్రాల విజయచందర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులతో ఆయన మాట్లాడారు. అనంతరం స్టోర్ రూమ్‌లో తి ను బండారాలను పరిశీలించి ప్రభుత్వం సరఫరా చేస్తున్న ప్రతి వస్తువు తాజాగా ఉందో లేదో ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నా రు. మెరుగైన ఫలితాలు సాధనకు కృషి చేయాలని పాఠశాల ప్రిన్సిపాల్ కిర ణ్మయికి, సిబ్బంది సూ చించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడిన జడ్జి రాష్ట్ర హైకోర్టు ఆదే శాల మేరకు పాఠశాలలను తనిఖీ చేస్తున్నట్టు తెలిపారు. కోర్టు సిబ్బంది, న్యాయ వాదులు డి. శ్రీనువాసరావు, న్యాయవాదుల సంఘం కార్యదర్శి జీవీ రమణ, కోశాధికారి జి.కృష్ణమూర్తి, జాయింట్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.



వేపాడ: విద్యార్థినులతో మాట్లాడుతున్న విజయచందర్

నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి

విజయనగరం దాసన్నపేట: విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. బుధవారం పూల్‌బాగ్‌లోని ఏపీ మోడల్ స్కూల్‌ను సందర్శించారు. అన్ని తరగతి గదులను, వంట గదులను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. పాఠశాల కమిటీ చైర్మన్ జయరాజ్, ప్రిన్సిపాల్ బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటుతో విద్యార్థులకు నష్టం

కొత్తవలస: పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల సర్దుబాటు కారణంగా 3 నుంచి 8 వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు నష్టం జరుగుతుందని యూటీఎఫ్ ఉపాధ్యాయ సంగం ప్రతినిధులు సీహెచ్ నిర్మలా దేవి, జి.విజయగౌరి ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల ప్రాథమికోన్నత పాఠశాలలో సబ్జెక్టు ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు.

తాగునీటి సరఫరా నిలిపివేత

రేగిడి: సంకిలి నాగావళి రక్షిత పైప్‌లైన్లు ఉంగరాడమెట్ట పెట్రోల్ బంక్ సమీపంలో పూర్తిగా పాడయ్యాయి. దీంతో ఈ రక్షితసోర్స్ పరిధిలో ఉన్న స్కీమ్‌వాటర్‌ను రెండు రోజులుగా నిలిపివేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది తెలిపారు. ఈ కారణంగా మండలంలోని 40 గ్రామాల్లో తాగునీటి సమస్య వేధిస్తోంది. సంకిలి, చిన్నయ్యపేట, దేవుదళ, అప్పాపురం తదితర గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఏఈ శ్రీచరణ్ ఆధ్వర్యంలో ఈ పైప్‌లైన్ మార్పే చర్యలు చేపట్టారు. బుధవారం ఏదో సమయానికి నీటి సరఫరా చేస్తామని ఏఈ వెల్లడించారు.

విద్యార్థులకు అభినందన

జామి: కుమరాం కేజీబీవీ ప్రతిష్ఠను ఉపాధ్యాయులు పెంచారని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించిన ఈ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులను బుధవారం అభినందించారు. ప్రిన్సిపాల్ బలగ జ్యోతి, పౌర వేదిక కార్యదర్శి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

విధులపై సర్పంచ్‌లకు అవగాహన ఉండాలి

జామి: పంచాయతీ విధులపై పూర్తి అవగా హన ఉండాలని పంచా యతీరాజ్ సహాయ కమి షనర్ కృష్ణ మోహన్‌సూచించారు. జామి మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణ తరగతులను బుధవారం ఆయన పరిశీలించారు. పంచాయితీ నిధులు, అభివృద్ధికి సంబంధించిన అంశాలను సర్పంచులు, కార్యదర్శులు తెలుసుకోవాలన్నారు. ● **వేపాడ:** మండల పరిషత్ సమావేశ భవనంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సర్పంచ్‌ల శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఉమ తదితరులు పాల్గొన్నారు. ● **కొత్తవలస:** మండలానికి చెందిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు 3 రోజులపాటు స్థానిక ఎంపీడీవో కార్యాయంలో నిర్వహించిన శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. రాష్ట్ర కమిషనర్ కృష్ణమోహన్ హాజరయ్యారు. ఏ గ్రామ పంచాయతీ అయినా అభివృద్ధి జరగాలంటే గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి సమన్వయతో కలసి పనిచేయాలన్నారు. ● **బొబ్బిలి:** బొబ్బిలి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మూడో రోజు సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ రవి కుమార్ ఆధ్వర్యంలో వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ డైరెక్టర్ నాగ రాజు శిక్షణ తరగతులను వీక్షించి సభ్యులతో మాట్లాడారు. ● **రామభద్రపురం:** మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి సర్పంచులు డుమ్మా కొట్టారు. 22 గ్రామ పంచాయతీలకు గాను ఒక్క సర్పంచ్ కూడా శిక్షణకు హాజరుకాకపోవడం విశేషం. పంచాయతీలలో వివిధ అభివృద్ధి పనులు, సర్పంచ్‌ల బాధ్యతలు తదితర అంశాలపె అవగాహన కల్పించాలని ప్రభుత్వం ఈ శిక్షణ నిర్వహించింది. దీనిపై మండల అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా, అందుబాటులో లేరు.



సూచనలు చేస్తున్న కమిషనర్ కృష్ణమోహన్

సహారా బాధితుల నిరసన

ఖాతాదారుల డిపాజిట్ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సహారా ఉద్యోగులు, బాధితులు బుధవారం జిల్లా వ్యాప్తంగా నిరసన ర్యాలీ చేశారు. మానవహారం నిర్వహించారు.



బొబ్బిలిలో..



రాజాంలో..

ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు

● ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్/ రింగురోడ్డు, ఆగస్టు 14: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆర్టీసీ సిబ్బంది కృషి చేయాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చెప్పా రు. విజయనగరం నుంచి విజయవాడ సూపర్ డీలక్స్, విజయనగరం నుంచి విశాఖపట్టణం ఎక్స్‌ప్రెస్ రెండు కొత్త బస్సులను ఆమె బుధవారం విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రారంభించారు. బస్సును పరిశీలించి కాసేపు కూర్చున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, సంబంధిత శాఖ మంత్రి రామప్రసాద్‌రెడ్డి తదిత రులు ఆర్టీసీలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. కూటమి ప్ర భుత్వం వచ్చిన తరువాత కొత్త ఆర్టీసీ బస్సులను అన్ని డిపోలకు పంపుతు న్నార న్నారు. రానున్న రెండు నెలల కాలంలో మరిన్ని ఆర్టీసీ బస్సులు విజయనగరా నికి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజరు శ్రీనివాస రావు, సిబ్బంది పాల్గొన్నారు.



బస్సును ప్రారంభిస్తున్న అదితి

కొట్టక్కి వద్ద 20 కిలోల గంజాయి పట్టివేత

● గోప్యంగా ఉంచిన పోలీసులు

రామభద్రపురం: మండల పరిధిలోని కొట్టక్కి జాతీయ రహదారి వద్ద బైకుతో గంజాయిని అక్రమ రవాణా చేస్తున్న ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని అతని నుంచి సుమారు 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. ఒడిషా రాష్ట్రానికి చెందిన ఒక వ్యక్తి ద్విచక్రవాహనంపై ఈ గంజాయిని విజయనగరం వైపు తీసుకువెళుతుండగా అతనిని పోలీసులు పట్టుకున్నారు. అయితే ఈ గంజాయిని ఎక్కడ నుంచి తెస్తున్నదీ..? ఎవరికి విక్రయించడానికి అన్న వివరాలు ఇవ్వడానికి పోలీసులు నిరాకరించారు. సమాచారం అంతా గోప్యంగా ఉంచారు. పోలీసుల అదుపులో ఉన్న నిందితుడిని బుధవారం ఉదయం నుంచి ప్రశ్నిస్తున్నప్పటికీ ఒడిశా భాష అర్థంకాక పోలీసులు మల్లగుల్లాలు పడుతున్నట్టు సమాచారం.

ఆక్రమణలను నిరోధించకపోతే ఆందోళన

రామభద్రపురం: మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని జనసేన బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిరడ అప్పలస్వామి ఆరోపించారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.